కథ

# ధృతరాష్ట్రం

వసుంధర

సాయంత్రం ఆరు. రోజూలాగే శ్రీవారు, నేను వాకింగులో ఉన్నాం. రోజూలాగే దేశ కాల సాంఘిక రాజకీయ పరిస్థితుల్ని విశ్లేషిస్తూ నిట్టూరుస్తున్నాం. రోజూలాగే ప్రభాకర్ బండి దగ్గర ఆగి మసాలా మిక్చర్ ఆర్డర్ చేసేక, ''ఏంటీ నాలుగు రోజులుగా బండి పెట్టడం లేదు?'' అన్నారు శ్రీవారు.

ప్రభాకర్‌కి కీళ్ళ నొప్పుల్లాంటి వొచ్చి డాక్టర్ దగ్గిర కెడితే ఆయన మూడ్రోజుల పాటు ఇంజక్షన్లు చేసి - ఆర్రోజులు విశాంత్రి తీసుకోమన్నాట్ట. ఆయనకివ్వాల్సిన ఆరొందలూ వెంటనే ఇవ్వాలంటే విశ్రాంతి కుదరదని ఈ రోజే బండి పెట్టేసాడు.

నేను వెంటనే ''ఆరోగ్యశ్రీ ఉందిగా - ఆరొందలెందుకూ?'' అంటే ప్రభాకర్ కూడా అంత వెంటనే నవ్వేసాడు. కట్నమడిగిన వరుడి తండ్రి, లంచమడిగిన ప్రభుత్వోద్యోగి, ట్రాఫిక్‌లో వెహికల్ డ్రైవరు - చట్టం గుర్తు చేసిన వారి అమాయకత్వానికి అలాగే నవ్వుతారేమోననిపించింది.

వాకింగు రిటర్నులో ఆ విషయమే చెబితే, ''ఇతరుల దాకా ఎందుకూ... మనం చేసే వాకింగుకీ - తినే మసాలా మిక్చర్‌కీ పోసుగుతుందంటావా?'' అన్నారు ఫిట్‌నెస్ కాన్షస్ ఉన్న శ్రీవారు.

''రాళ్ళు తిని హరాయించుకునే వయసులో - మసాలా మిక్చర్ మన్నేం చేస్తుంది? అందులోనూ ప్రభాకర్ చేతిలో అమృతముంది కూడా. నో రిగ్రెట్స్ - ఎంజాయ్'' అని మందలించాను.

''ఇలా అమృతానికి ఆశపడితే ఆరోగ్యానికి గ్రహణం తప్పదు''.

''రైతులకి ఉచిత విద్యుత్తు, ఆత్మహత్యలు ఆపలేదు. భాగ్యనగరంలో వరదలు, నీటికొరత తగ్గ లేదు. గూఢచర్యకి ఉపగ్రహాలు, తీవ్రవాదుల్ని అరికట్ట లేవు. తినడానికి జంక్‌ఫుడ్స్, మన ఆరోగ్యాలకి ఢోకాలేదు'' శ్రీవారు నవ్వి, ''అంతులేని సామాజిక స్పృహ, కథలకే పరిమితం. అసలు సిసలు ప్రజాస్వామ్యం, వ్యక్తిపూజకి ఢోకా లేదు'' అన్నారు. అది కేవలం జాబితాని పెంచడానికనలేదు. నా మీద విసురు. నేను కథల్రాస్తాననీ, పద్మక్కని ఆరాధిస్తాననీ ఆయనకి ఎగతాళి.

***

నేను ఉమ్మడి కుటుంబంలో పుట్టి పెరిగాను. నాన్న ఇంటికి పెద్దకొడుకు. ఆయనకి ఆరుగురు తమ్ముళ్ళు, అయిదుగురు చెల్లెళ్ళు. ఆఖరి చెల్లెలు పద్మ నాకంటె అయిదేళ్ళే పెద్ద కావడం వల్లనేమో... తనని అత్త అనకుండా అక్క అనమనేది. అదే అలవాటైంది నాకు.

నాకు మూడేళ్ళప్పుడు తాతగారు పోయారు. అప్పుడు నానమ్మ - ఇంటిబాధ్యత మా అమ్మ కప్పగించి తను దైవచింతనలో మునిగిపోయి - నిత్యం పూజలు, వ్రతాలు, దానాలు, గీతా పఠనాలతో కాలం గడిపేది. ఆఖరి పిల్ల కావడంతో పద్మక్క నానమ్మతోనే ఉండేది. వయసుకు తగ్గట్లు స్నేహితులతో ఆడుకోమని నాన్న మందలిస్తే, ''నానమ్మతో ఉంటే నష్టమేమిటి? క్లాసులో టాప్ ఫైవ్‌లో ఉంటున్నాగా?'' అనేది.

అప్పట్లో నాకు పద్మక్కంటే ఆరాధన. దానికి తోడు ఆమె రీజనింగ్ కూడా నచ్చి, ''ఔను కదా, నాన్నా!'' అంటే ఆయన, ''ఆ పిల్లికీ ఎలక సాక్ష్యం'' అంటూ కోపం, ముచ్చట కలిసిన ముఖం పెట్టే వారు.

నాన్న తరచుగా మందలించడం వల్లో, లేక తనకీ ఆసక్తి తగ్గిందో కానీ - పద్మక్క క్రమేపీ నానమ్మ సాంగత్యం తగ్గించి తోటి పిల్లలతో ఆటలకి వెళ్ళసాగింది. నేను పూర్తిగా తనతోనే తిరిగేదాన్ని. తను నాపై పెద్దరికం ప్రదర్శించేది. పక్కన స్నేహితులంటే ఆ అథార్టీ శృతి మించేది. ఎందుకో తెలియదు కానీ - నేనామెకు ఎదురు చెప్పలేక పోయేదాన్ని.

మేము ప్రతి ఏటా సిటీలో అమ్మమ్మ ఇంటి కెళ్ళే వాళ్ళం. మాతో పద్మక్క కూడా వచ్చేది. అమ్మ, నాన్న, పద్మక్క మూడు నాలుగు రోజులకంటె ఉండే వారు కాదు. నేనూ వాళ్ళతో వెళ్ళిపోతానని పేచీ పెట్టేదాన్ని. నిజానికి నాకు అమ్మమ్మ దగ్గర ఇంకా ఉండాలనుండేది. కానీ ఓ సారి నేను పేచీ పెట్టకుండా ఉండిపోయానని - తిరిగి వెళ్ళాక బాగా తిట్టింది పద్మక్క - ''అమ్మమ్మని చూస్తే నన్ను మర్చిపోతావా?'' అని.

పేచీ పెట్టినా అమ్మమ్మ బలవంతంగా నన్నుంచేసుకుంటుందని తెలుసు. పద్మక్కని తృప్తి పరచడం కోసమే నా పేచీ. కానీ నా పేచీ నిజమనుకుని అమ్మ కానీ తనతో వచ్చేయమనదు కదా అన్న భయమూ నాకుంది. కానీ అమ్మ అమ్మే! నా మనసు కనిపెట్టి మసిలేది. నాకు తోడుగా పద్మక్కనీ ఉండి పొమ్మనేది అమ్మమ్మ. కానీ నానమ్మ పంపేటప్పుడే, ''అది ఆఖరుది. దాన్నొదలి నేనెక్కువ రోజులుండలేను. మీతోటే తీసుకొచ్చేయాలి'' అని షరతులు విధించేది.

అమ్మమ్మింట్లో ఉండడం వల్ల పద్మక్క అథార్టీ కొన్నాళ్ళైనా తప్పిందని మనసులో ఆనందంగా ఉండేది. అక్కడ నామీదెవరూ అథార్టీ చేసే వారు లేరు సరికదా, అమ్మ దగ్గరలేదని బెంగెట్టుకుంటానని కాస్త ఎక్కువ గారం చేసే వాళ్ళు. అదికాక మామయ్యల పిల్లలతో సినిమాలు, షాపింగులూ నాకు నచ్చేవి. అమ్మమ్మ చెప్పేకథలు కూడా. సత్ప్రవర్తనని బోధించే ఆ కథల్లో - మానవసేవ అన్న ప్రబోధముండేది. తెలిసి ఎవరినీ బాధపెట్ట కూడదనీ, ఎదుటి వారికి సంతోషం కలిగించడం లోనే మన సంతోషమున్నదనీ తరచుగా చెప్పేది అమ్మమ్మ. నాకు నానమ్మ గుర్తు కొచ్చి, ''మరీ పూజలు చేయక్కర్లేదా?'' అనడిగాను. ''పూజల వల్ల నియమం, నిష్ఠ, ఏకాగ్రత ఏర్పడతాయి. కేవలం పుణ్యం కోసమే పూజలు చేయడం సరి కాదు'' అంటూ చాలా చెప్పేది అమ్మమ్మ. అన్నీ అర్థం కాకపోయినా వినడానికి ఆసక్తిగానే ఉండేది నాకు.

***

ఇంటర్ అయ్యాక పద్మక్కకి పెళ్ళైపోయింది. ఎనిమిదో తరగతిలో కొచ్చిన నేను పద్మక్క భర్తని మామయ్య గారు అని వరసకలిపితే - ''పద్మని

అక్కంటావుగా - నన్ను బావంటేనే బాగుంటుంది'' అన్నారు. పద్మక్క కూడా దీనికి ఒప్పుకుని, ''బావా కాదు, బావగారు అని పిలు'' అని సవరించింది.

బావగారి ఉద్యోగ రీత్యా వేరే ఊళ్ళో కాపురం పెట్టారా దంపతులు. ఐతే పండగలనీ, ఇవనీ, అవనీ తరచూ మా ఇంటికొస్తూ పోతూండడం వల్ల బావగారితోనూ నా పరిచయం పెరిగింది.

అప్పటికి పద్మక్క మీద నాకున్న ఆరాధనా భావం తగ్గ సాగింది. తనేం చేసినా శ్రద్ధగా గమనించే దాన్ని. ఎదుటివాళ్ళమీద జోకులేసీ నొప్పించడం పద్మక్క అలవాటు. అది తప్పని చెప్పే ధైర్యం నాకు లేదు.

అవసరమున్న వాళ్ళు పద్మక్క జోకుల్ని తన దగ్గర మౌనంగా భరించే వారు. నాతో మాత్రం ''ఇలా మమ్మల్ని బాధ పెట్టడంలో మీ అక్కకి కలిగే ఆనందమేమిటో తెలియదు. కానీ అవసరం మాది'' అనే వారు.

అవసరం లేని వాళ్ళామెకి దూరంగా ఉండే వారు.

పద్మక్క ఆ అలవాటు గురించి పెద్దవాళ్ళకి తెలియదు. ఎందుకంటే తను వాళ్ళ దగ్గిర ఎక్కువ మాట్లాడేది కాదు. మాట్లాడితే వాళ్ళు కొంత సంస్కరించే వాళ్ళేమో మరి. కానీ ఇప్పుడు పద్మక్క తనకంటే ఆరేడేళ్ళు పెద్దైన బావగారి ముందు కూడా ఇతరుల్ని నొప్పిస్తోంది. కానీ బావగారామెని తప్పు పట్టడం నేను వినలేదు, కనలేదు. ఆమె ప్రవర్తనని బట్టి బావగారామె అలవాటుని పెంచి పోషిస్తున్నారనిపించింది.

ఆసక్తి పద్మక్కని శ్రద్ధగా గమనించేలా చేస్తే, నాలో దాగున్న రచయిత్రి ఆమెని విశ్లేషించ సాగింది.

పద్మక్కకి అత్తింటి వారనీ, పుట్టింటి వారనీ, బయటవారనీ భేదం లేదు - తనకి లాభం లేని చోట పిల్లికి బిచ్చం పెట్టదు. తనకోసమైతే ఎంత ఖర్చుకీ వెనుకాడదు. అదృష్టమో, దురదృష్టమో - అందుకు బావగారి మద్దతు కూడా ఉంది. ''మీ అక్క చేసే పూజలూ, వ్రతాల వల్లే నాకు పుణ్యం. ప్రతిఫలంగా తనడిగిందివ్వడం నా ధర్మం. అందుకే మామూలుగా ఐతే నా జీతం ఎక్కాతొక్కీ ఐనా. మీ అక్కకోసం నేను ఓవర్ టైంచేస్తున్నాను, టూర్స్ ఎక్కువేసుకుంటున్నాను'' అంటా రాయన ముచ్చటగా.

నాకు ఇంటర్మీడియేట్‌లో ఉండగానే సంబంధాలు చూడమని నానమ్మ పోరు ప్రారంభించింది. ''నా మాట విని ఒక్క కొడుకు కోసం చూడరా అన్నా. ససేమిరా అని ఒక్క కూతురితోనే ఆపేసావు. వంశం నిలబెట్టడానికి తమ్ముళ్ళ కొడుకులున్నారుగా అని వితండ వాదం చేసి నా నోరు మూయించావు. ఇప్పుడు దీని పెళ్ళి విషయంలోనైనా నా మాట విని - నేను పోయేలోగా దాని పెళ్ళి చేయరా'' అని.


ఆ మాట నాన్నగారికీ నచ్చే ఉండాలి. పిల్లల్ని కనడంలో నానమ్మ మాట వినని ఆయన, ''అమ్మ కోసం పిల్లకి పెళ్ళి చేయాలి'' అంటూ నాకు పెళ్ళి ప్రయత్నాలు మొదలెట్టారు. అప్పుడు పద్మక్క ముందుకొచ్చి, ''అదీ నేనూ అక్క చెల్లెళ్ళలా కలిసి పెరిగాం. పెళ్ళయ్యాక కూడా కలిసుండేలా - దగ్గిర సంబంధంలో చూస్తాను'' అని నాన్నగారికి హామీ ఇచ్చి - తొందర్లోనే బావగారి కజిన్‌తో సంబంధం కుదిర్చింది.

నేను డిగ్రీ చేస్తానని పట్టుబట్టాను. పద్మక్క కుదిర్చిన వరుడు, అతడి తల్లిదండ్రులూ పెళ్ళైనా చదువు కొనసాగించొచ్చని హామీ ఇవ్వడంతో ఇంటర్ పరీక్షలు వ్రాసిన రెండు వారాలకే నా పెళ్ళై పోయింది.

మా వారి ఉద్యోగమూ బావగారి ఊళ్ళోనే. కాలేజీ తెరిచేదాకా మమ్మల్నిద్దర్నీ కలిసుండమన్నారు మా అత్తగారు. అంతేకాదు - నేను కాలేజీలో చేరాక నా చదువుకి ఆటంకం లేకుండా - వంటకీ దానికీ సాయంగా మావారి నానమ్మ వచ్చే ఏర్పాటుచేసారు. నేనావిడ మంచితననాకి సంతోషించినా అంతకంటే ఎక్కువగా పద్మక్కకి మనసారా కృతజ్ఞతలు చెప్పుకున్నాను. అంత మంచివాళ్ళతో సంబంధం కలిపినందుకు.

మా ఇల్లు పద్మక్క ఇంటికి బాగా దూరం. కానీ పద్మక్క రోజూ ప్రొద్దుటే ''ఇంట్లో ఒక్కర్తివీ ఏం ఉంటావ్. ఇక్కడికొచ్చేసేయ్'' అని ఫోన్ చేసేది.

శ్రీవారిని బ్రతిమాలుకుంటే - తను ఆఫీసుకు వెళ్ళేముందు వాళ్ళింట్లో దింపి వచ్చేటప్పుడు తీసుకొచ్చేవారు. బావగారు రోజూ ఇంటికి లేటుగా రావడం, ఆదివారాలు కూడా ఆఫీసుకు వెళ్ళడం వల్ల - అక్కకి నా కంపెనీ అవసరమే కానీ - అక్క నన్ను సాయంత్రం వెంటనే పంపక పోవడం, ఆదివారాలు కూడా వాళ్ళింటికి



రమ్మనడం మావారికి నచ్చేది కాదు. అలా పది రోజులు గడిచేక, ''నీకు కాలేజీలు మొదలైతే మనకి ఎలాగూ ఖాళీ దొరకదు. ఇప్పుడైనా ఇద్దరం ఫ్రీగా వుందాం. మీ అక్కకి రానని చెప్పు. అసలు ఇలాంటివన్నీ ఆవిడే అర్థం చేసుకోవాలి'' అన్నారు శ్రీవారు.

నేను చెప్పలేక చెప్పలేక ఆఖరికి ఒక రోజు ఫోన్‌లో, ''ఇంక రోజూ రాను. పండగలూ అవీ వస్తే ఎటూ నీ దగ్గరకే వస్తాను. మరి కాలేజీలకి అప్లై చేసుకోడాలూ అవీ అంతా బిజీగా ఉంటుంది'' అని చెప్పాను.

అక్కకి కోపమొచ్చిందని – ఆ తర్వాత నేను ఫోన్ చేసినప్పుడల్లా ముక్తసరిగా మాట్లాడుతుంటే – అర్థమైంది. కానీ క్రమంగా ఆ కోపం తగ్గి కొన్నాళ్ళకి మళ్ళీ మామూలైంది.


నేను కాలేజీలో చేరే సమయానికి శ్రీవారి నానమ్మ వచ్చింది. పెద్దావిడైనా ఆరోగ్యం బాగుంది. పెద్దవాళ్ళలా విసిగించదు. పెద్దవాళ్ళలా మంచి సలహాలు, మంచివంటలూ మాకు అందిస్తూ చాలా సహాయకారిగా ఉన్నదామె.

శ్రావణ మాసం నోములకి రమ్మంది అమ్మ. కాలేజీ పోతుందని రానన్నాను. శ్రీవారు నానమ్మ కూడా, ''ఇంకా చిన్నపిల్లే కదమ్మా – ఈ డిగ్రీ అయ్యాక చేస్తుందిలే. చాలామంది తమ పిల్లలతో చేసుకోడానికని ఒకటి రెండేళ్ళు ఉంచేసుకుంటారు కూడా'' అని నన్ను సమర్థించారు. అలాంటి మంచి ఇంట్లోకి నేను వచ్చినందుకు అమ్మ కూడా ఆనందపడింది.

అప్పుడు పద్మక్క రంగంలోకి దిగి – తనూ నా పుట్టింటిదే కాబట్టి – శ్రావణ శుక్రవారం ఒక్క రోజు నన్ను తనింటికి తీసుకెళ్ళి నోము నోపించి పంపిచేస్తానంది. అమ్మని కూడా ఆ రోజుకి అక్కడికొచ్చేయమంది. కానీ అమ్మకి ఏవో పనులు. రాలేక పోయింది.

పద్మక్క నన్ను శ్రావణ శుక్రవారానికి ముందు ఆదివారం – వాళ్ళింటికి రమ్మంది షాపింగ్ కోసం. వారానికి ఒక్కటే ఆదివారం గునిసిన శ్రీవారికి ఎలాగో నచ్చచెప్పి అక్కింటికి వెళ్ళాను.

అక్కా, నేనూ ఆటో మాట్లాడుకుని బయల్దేరాం. ఆదివారమైనా షాపులన్నీ తెరిచే వున్నాయి. తనకి ముత్తైదువులు మొత్తం పంతొమ్మిదిమందొస్తారని లెక్కేసింది అక్క. ''జాకెట్టు గుడ్డలు, స్టీలు ప్లేట్లు, సెనగలు ఇప్పుడు కొందాం. ఇప్పుడే కొంటే పాడై పోతాయి కాబట్టి – పూలూ, పళ్ళూ, తమల పాకులూ ఒక రోజు ముందు కొంటా'' అంది అక్క.



షాపుల్లోకి వెళ్ళి జాకెట్టు గుడ్డలు చూస్తున్నాం. చాలాచోట్ల మీటరు, ఎనభై సెంటీమీటర్ల ముక్కలున్నాయి. డెబ్బై సెంటీమీటర్ల పోలీయెస్టర్ ముక్కలైతే చవగ్గా ఉంటాయని వాటికోసం చాలా షాపులు తిప్పింది అక్క. మేమా ముక్కల కోసం అడిగితే – కొన్ని షాపుల్లో సేల్స్‌మన్ మాకేసి అదోలో చూసారు. కొన్ని షాపుల్లో వాళ్ళలో వాళ్ళే ముఖముఖాలు చూసుకున్నారు. ఆ చూపుల అర్థం నేనూహించగలను. పోలీయెస్టర్ ముక్కలతో జాకెట్లు కుట్టించుకునేదెవరు? కుట్టించుకున్నా – ఏదో పెట్టాలి కదా అని పెట్టడం కాకపోతే – డెబ్బై సెంటీమీటర్ల ముక్క జాకెట్టుకి సరిపోయే ముత్తైదువలెంత మంది ఉంటారు మనలో?

అదే ఓ సేల్స్‌మన్ అడిగిస్తే అక్కకి కోపమొచ్చి, ''అవన్నీ నీకెందుకయ్యా. మా కిష్టమైనవి మేమడుగుతాం. నీ దగ్గరుంటే ఉందనీ లేకుంటే లేదనీచెప్పు'' అని గదిమింది. ఆ షాపు యజమాని పరుగున వచ్చి అక్కకి సారీ చెప్పి సేల్స్‌బాయ్‌ని మందలించి, తమ దగ్గర ఆ ముక్కలు లేవని చల్లగా చెప్పాడు.

ఆఖరుకి ఒక షాపులో అక్కకి నచ్చిన క్వాలిటీ, ధరతో పంతొమ్మిది గుడ్డలు కొన్నాం. మరో చోట స్టీలు ప్లేట్లు బాగా పల్చగా వుండి చౌకగా వున్నవి పంతొమ్మిది తీసుకున్నాం. షాపతను ''అమ్మా – రెండు డజన్లు తీసుకోండి. పాడయ్యే వస్తువు కాదుకదా! అవసరమైతే ఉంటాయి'' అన్నా – ససేమిరా అంది అక్క. మరోచోట సెనగలు తీసుకుని ఇల్లు చేరాక – ''ఆటోకి డబ్బులు నువ్విచ్చేయ్, నీ కోసం ఇవన్నీ కొని పెట్టానుగా'' అంది అక్క. మారు మాట్లాడకుండా ఇచ్చేసాను. నిజానికి కొన్నవన్నీ కలిపినా కూడా ఆటోకే ఎక్కువ అయ్యింది – అన్ని షాపులు తిరగడం, వెయిటింగ్ చార్జీలు కలిపి.

శ్రావణ శుక్రవారానికి ముందురోజు రాత్రే అక్క ఇంటికి వెళ్ళిపోయాను. ఉదయాన్నే లేచి స్నానాలు, వంటలు, పూజలు, భోజనాలు అయ్యాక ఇద్దరం కలిసి పంతొమ్మిది పేకెట్లు కట్టేసి డ్రెస్సై పోయాం. అక్క నా చీర చూసి, ''నీ చీర చాలా బాగుందే'' అని – ''అసలు నీకు కొత్త చీర నేనే కొందామనుకున్నాను. కానీ ఇప్పటికే ఇవన్నీ కొన్నానుకదా ఇంకా ఖర్చుపెడితే మీ బావగారే మంటారోనని సంకోచించాను'' అంది.

''ఫరవాలేదక్కా! ఇది మా పెళ్ళైన మొదటేడు కదా నేనూ ఆయన కొన్నచీరే కట్టుకుందామనుకున్నా. ఐనా ఇంత చేసావు కదా!'' అన్నాను – తను పెట్టే ఆ చీరెలా ఉంటుందో మనసులో ఊహించుకుంటూ.

బావగారు కొన్నారంటూ అయిదు వేల రూపాయల చీరా, పది వేల రూపాయల నెక్లెసు పెట్టుకుంది పద్మక్క. పేరంటాళ్ళ రాక మొదలైంది. ఒకరొక్కరుగా కాక ఒకేసారి చాలామంది వచ్చేస్తే – మంచిదే, త్వరగా మా ఇంటికెళ్ళి పోవచ్చునుకున్నాను. అక్క కూడా ''ఇంక ఇద్దరే రావాలి. వాళ్ళూ అయిపోతే నువ్వు వెళ్ళి పోదువు గాని, మీ ఆయనకి రమ్మని ఫోన్ చేయ్'' అంటూ లోపలికెళ్ళింది. నేను వారికి ఫోన్ చేసే పనిలో ఉండగా పేరంటాళ్ళ కబుర్లు. వాళ్ళలో వాళ్ళు నెమ్మదిగానే మాట్లాడుకుంటున్నారు కానీ నావి పాము చెవులు.

''ఈవిడిచ్చే ఈ జాకట్టు గుడ్డలు ఎందుకూ పనికి రావు. కొనడం ఆవిడకీ, పుచ్చుకోవడం మనకీ వేస్టు''

''తను మాత్రం చూడు. ఎంత ఖరీదైన చీరలు కడుతుందో''.

''ప్రతీ ఏటా ఇదే తంతు కదా!''

''ఇంటికే చుట్టమైనా వస్తే – పోనీ పసుపూ, కుంకమే కదా అని తీసుకొద్దామన్నా భయమే. వచ్చిన వాళ్ళనీ, తీసుకొచ్చిన వాళ్ళనీ కూడా మరొకళ్ళ దగ్గిర తిట్టిపోస్తుంది. అందుకే మా అమ్మాయినే తీసుకు రాలేదు''.

అంతలో అక్క అటు రావడంతో అంతా తనతో చాలా ఆత్మీయంగా మాట్లాడేసారు. నాకు మాత్రం ''అనేదేదో ముఖం మీదే అంటే అక్కకి తప్పు తెలిసేదేమో'' అనిపించినా ''స్వంత మనిషిని నేనే అననప్పుడు బయట వాళ్ళెందుకంటారు?'' అని సరిపెట్టుకున్నాను.

మా ఆయనొచ్చేలోగా మరో నలుగురు పేరంటాళ్ళు వచ్చారు. వాళ్ళను చూడగానే అక్క ముఖం పాలిపోయింది. అక్కడికీ ఒకావిడ వస్తూనే ''మా తోడికోడళ్ళొచ్చారు. వాళ్ళు రామంటున్నా – మా పద్మగారిల్లే లెండి. ఐనా పసుపు కుంకుమలకి పిలవక పోయినా వెళ్ళొచ్చట, అలాంటిది ఆవిడ నన్ను పిలిచారు కూడానూ – అని బలవంతంగా తీసుకొచ్చాను'' అంది.

అక్క తన ముఖంలో మార్పు కనబడనివ్వకుండా ''రండి రండి, మంచిపని చేసారు'' అంటూ వాళ్ళని లోపలికి ఆహ్వానించింది. నన్ను లోపలికి తీసుకెళ్ళి, ''ముత్తైదువలు అనుకున్న కంటే మరో ఇద్దరెక్కువయ్యారు. నువ్వు పక్కింటికెళ్ళి వాళ్ళ వాయినాలు తీసుకురా. వాళ్ళకి మళ్ళీ కొనిస్తాలే'' అని చెప్పింది.

నేను వేరే గుమ్మం లోంచి పక్కింటికెళ్ళి విషయం చెబితే అక్కుడున్న అత్తా కోడళ్ళు ముఖముఖాలు చూసుకుని ''మీ అక్క మళ్ళీ తిరిగివ్వడమెందుకూ? కొత్త పెళ్ళి కూతురివి. మేమిద్దరం నీకు బొట్టు పెట్టి ఇచ్చేస్తాం లే'' అని నాకు బొట్టు పెట్టి అవే వాయినాలు ఇచ్చేసారు.

పేరంటాళ్ళు వెళ్ళేక అక్కకి జరిగింది చెప్పాను. అక్క నిట్టూర్చి, ''క్రిందటేడూ ఇలాగే జరిగింది. అప్పుడూ వాళ్ళింటినించే తెచ్చాను. అవింకా ఇవ్వనేలేదు. పోనీలే ఈ ఏటివి ఇవ్వక్కరలేదు. పాతవే బాకీ'' అంది.

''అంటే ఇలా జరగడం అక్కకి కొత్త కాదు. తెలిసీ ఎందుకిలా చేసింది?'' అని మనసులో మాత్రం అనుకున్నాను. పైకి అనే ధైర్యం నాలో లేదుగా!

మా వారు రాగానే అక్క ఆయనకి టిఫిను పెట్టింది. తినగానే ఇంటికి వెళ్ళిపోయాం.

తర్వాత నాకు కాలేజీ హడావుడితో అక్క దగ్గరికి తరచు వెళ్ళడం లేదు. మధ్యలో ఫోన్లు చేస్తున్నాను. ఈలోగా దసరా వచ్చింది. అక్క దసరా తొమ్మిది రోజులూ పూజలు చేస్తుంది. నన్ను రమ్మంటే, ''అత్తారింటికెడుతున్నా. దశమి నాటికి తిరిగొస్తాం. ఆ మర్నాడే నాకు కాలేజీ'' అని సంజాయిషీ ఇచ్చాను.

''ఐతే దశమినాడు ఇక్కడికొచ్చెయ్. ఆ రోజు పేదలకి అన్నదానం చేస్తాను, చూద్దువు గాని'' అంది అక్క.

అక్క మాట కాదనలేక – దశమి నాడు అత్తారింటి నుంచి తిరిగి రాగానే స్నానం చేసి అక్కింటికి వెళ్ళాను.

అప్పటికే అక్క అన్నం వండింది. పల్చగా పప్పుపులుసు పెట్టి సాంబారంది. మజ్జిగ పల్చన చేసి పెరుగంది. మేమిద్దరం సాంబారన్నం, పెరుగన్నం విడివిడిగా కలిపి చిన్న పొట్లాలుగా కట్టేము. అవి తీసుకుని ఓ గుడి దగ్గరకెళ్ళేం. అక్కడ సుమారు వంద మంది బిచ్చగాళ్ళున్నారు. పర్వ దినాల్లో గుళ్ళ దగ్గర బిచ్చగాళ్ళు అధిక సంఖ్యలో ఉండడం మామూలే కానీ అంత మందుంటారనీ నేనూహించలేదు.


ఆటో దిగగానే బిచ్చగాళ్ళు మమ్మల్ని చుట్టుముట్టేసి – తమలో తాము కొట్టుకుంటూ మామీద పడసాగారు. అన్నం పొట్లాల సంచీ నా చేతిలో ఉంది. అందులోంచీ గబగబా ఒకో పొట్లాం తీసి దూరంగా విసిరేస్తోంది. యువరాజ్ సిక్సర్లా దూసుకుపోతున్న ఆ పొట్లాల్ని కిందపడి పోకుండా సురేష్ రైనాలా పరుగున వెళ్ళి క్యాచ్ పడుతూ ఆస్ట్రేలియన్ క్రికెటర్సులా ఒకళ్ళనొకళ్ళు గుద్దుకుంటూ, పడిపోతూ బిచ్చగాళ్ళు....

ఆ దృశ్యం మన దేశంలో ఆకలికి అద్దం పడితే – నా భావాల్ని అక్కతో పంచుకోవాలని తన వైపు చూస్తే ఆమె ముఖం రోడ్ షో నిర్వహించిన రాజకీయ నేతలా ఉంది. పొట్లాలన్నీ ఐపోయి అక్కణ్ణుంచి వెనక్కి మళ్ళేక, ''అంతమంది జనం మన కోసం ముందుకొచ్చి తొక్కిసలాడుతుంటే ఆ మజా ఏ ఆట చూస్తే వస్తుందీ! పుణ్యానికి పుణ్యం, వినోదానికి వినోదం'' అంది అక్క.

పూర్వకాలంలో – ఒకరినొకరు చంపుకునే దాకా ద్వంద్వ యుద్ధం చేసే గ్లాడియేటర్స్‌ని చూసి వినోదించే రాజులుండే వారట. ఆ కాలం పోయినా మనుషుల్లో ఆ రాజుల అంశ ఇంకా పోలేదనిపించింది. ఇక అక్కచేసే పుణ్యకార్యాలకి దూరంగా ఉండాలని అప్పుడే నిర్ణయం తీసుకున్నాను. కానీ – ఇట్టే వచ్చింది కార్తీక మాసం.

''క్షీరాబ్ది ద్వాదశి రాత్రి – పూజ ఉంది. బ్రాహ్మడికి వెండి ప్రమిదలో బంగారు వత్తి వేసి దానమిస్తాను. రాత్రి పూట కదా! కాలేజీ నుండి ఇటొచ్చెయ్'' అంది అక్క.

ఇలాంటి వాటికి దూరంగా ఉండాలనుకున్నా – వెండి ప్రమిద, బంగారు వత్తిదానం నేను ఎప్పుడూ చూడలేదు. నానమ్మ ఇత్తడి ప్రమిదలివ్వడం తెలుసు. నా కుతూహలం మరోసారి



అక్క ఇంటికి తరిమింది నన్ను. ఆ రోజు నేను కాలేజీ నుంచి అక్క ఇంటికెళ్ళే సరికి పూజ జరుగుతోంది. కాళ్ళూ, చేతులూ కడుక్కుని, అక్క నాకోసం ఉంచిన టిఫిన్ తినేసి అక్క పక్కన కూర్చున్నాను. అప్పటికి బ్రాహ్మణుడు కథ చదువుతూ – పూజా విధానం గురించీ, తులసి కోటలో ఉసిరికొమ్మ నాటడానికి కారణాలు వగైరాలు చెబుతున్నాడు. నాకు మాత్రం ''నువ్వెన్ని పాపాలు చేసినా, ఎలా ప్రవర్తించినా, ఈ రోజు ఈ పూజతో – నీ పాపాలన్నీ ప్రక్షాళన అయిపోయి నిన్ను స్వర్గానికి పుష్పక విమానంలో తీసుకెడతారు. ఈ పూజ చేయని వాళ్ళు రౌరవాది నరకాలు పట్టిపోతారు. దీపంలో వత్తిలా కాలి బూడిదైపోతారు. ఐతే కథ చదివినా, విన్నా కూడా పుణ్యం వస్తుంది'' – అన్నదొక్కట్టే కొట్టొచ్చినట్టు వినిపించిన పాయింటు.

శాసనసభలో ప్రభుత్వ, ప్రతిపక్ష నాయకుల సంభాషణ సారాంశలా ఉన్న – ఆ కథ వినగానే వళ్ళు జలదరించి, మనసంతా భయంతో నిండిపోయింది. కథ విన్నాను కదా అని కాస్త ధైర్యమొస్తే అది వేరే సంగతి.

అంతలో దీపదానం ప్రారంభమైంది. వెండి ప్రమిద పల్చగా రేకులా ఉంది. సన్నటిదారం పోగులాంటి బంగారు వత్తి, అక్క వాటిని బ్రాహ్మడికి దానమిస్తే – ఆయన మంత్రాలతో అక్కని అశీర్వదించారు. తర్వాత ఆయన వాటిని అక్కకి తిరిగి ఇచ్చేస్తే – అక్క ఆయన చేతిలో యాభై ఎనిమిది రూపాయలు పెట్టింది.

బ్రాహ్మణుడు వెళ్ళిపోయేక, ''దానమిచ్చి వెనక్కి తీసేసుకున్నావేంటీ?'' అన్నాను ఆశ్చర్యంగా

''అదంతే! నేను తరచుగా బంగారం కొనే నగల షాపతను ఒక రోజుకి గాను ఈ రెండూ నాకు ఫ్రీగా ఇస్తాడు. నేను – ఇదిగో ఇలా పని కానిచ్చుకుని రేపు షాపతనికి వెనక్కిచ్చేస్తాను. అలా నాకు యాభై ఎనిమిది రూపాయలకే వెండి ప్రమిద, బంగారు దీపం దానం చేసిన పుణ్యం. ఎలా ఉంది?'' అంది అక్క.

అప్పుడు నాకు ఆ బ్రాహ్మణుడిలో మన దేశ పౌరులు కనిపించారు. అక్కలో ప్రజా సంక్షేమ పథకాలు కనిపించాయి. దేవుడి విగ్రహాల్లో సినీ తారలు కనిపించారు. ప్రజాస్వామ్యం ఓ వ్రతంలా తోచింది.

నాలోని రచయిత్రి ఇదంతా కథగా వ్రాయమని ప్రబోధించింది. నాలోని మనిషి, ''ఈ కథ అక్క చదివితే?'' అని భయపెట్టింది. శ్రీవారికి నా సందిగ్ధం చెబితే, ''మన దేశంలో పాండవులని హీరోలుగా భావించొచ్చు కానీ పౌరుల్లో ప్రతి ఒక్కడూ ధృతరాష్ట్రుడు. నీ సందిగ్ధం మహాభారత కాలం నాటిది''అని నవ్వారు.

నేను పద్మక్కని ఆరాధిస్తానని ఆయన ఎగతాళి చేస్తారు. కానీ ధృతరాష్ట్రుడు ధుర్యోధనుణ్ణి ఆరాధించేడా? ఆరాధించకపోతే దుర్యోధునుడి విజృంభణకి దారి తీసిన ఆ భావనని ఏమనాలి?

నా సందిగ్ధం ధృతరాష్ట్రమై కొనసాగుతూనే ఉంది.

★

చిరునామా :
మిస్. జె.రామలక్ష్మి,
శ్రీ వాణి గిరిజా నిలయం,
63 సాకేత్ ఫేజ్-1, కాప్రా,
ఇసిఐఎల్ పోస్ట్, హైదరాబాద్ - 62,
ఫోన్: 271441697.


# అన్నమయ్య మధుర భక్తి

అందరి కాధారమైన ఆదిమ పురుషుడీతడు
విందై మున్నారగించె విదురుని కడనీతడు

సనకాదులు గొనియాడెడి సర్వాత్మకుడీతడు
వనజ భవాదులకును దైవంబైనతడీతడు
యినమండలమున జెలగేటి హితవైభవుడీతడు
మును పుట్టిన దేవతలకు మూల భూతియీతడు

సిరులొసగి యశోదయింటి శిశువైనతడీతడు
దరనావుల మందలలో తగ జరిపించెనీతడు
సరసతులను గొల్లెతలను జనువులొసగెనీతడు
అరసి కుచేలుని యటుకు లారగించెనితడు

పంకజభవాదులకును బ్రహ్మపదమొసగెనీతడు
సంకీర్తనలాద్యులచే జట్టి గొనియెనీతడు
తెంకిగనే కాలము బరదేవుడైన యీతడు
వేంకటగిరి మీద ప్రభల వెలసిన ఘనుడీతడు



అన్నమాచార్యుడు ఈ సంకీర్తనలో జగద్రక్షకుడైన శ్రీకృష్ణ భగవానుని గొప్పదనాన్ని వివరిస్తున్నాడు. ఈ సృష్టికి అంతటికీ ఆధారమైన వాడు శ్రీకృష్ణుడు ఒక్కడే. కురుపాండవ సంగ్రామానికి ముందు రాయబారియై హస్తినాపురానికి వెళ్లాడు. గర్వితులైన దుర్యోధనుని ఇంట కాకుండా, విదురుని ఇంటిలో విందారగించాడు. సనకసనందాది దైవర్షులచే నమస్కారాలందుకున్నవాడు. పద్మోద్భవుడైన బ్రహ్మ దేవునకు పట్టం కట్టిన ఉత్తమోత్తముడు. సూర్యమండల మధ్యవర్తియై వెలిగే సాక్షాత్ శ్రీమన్నారాయణుడు ఇతడే. దేవతలకు మూలకారణమైన సంపద ఇతడే. యశోదకు ముద్దుబిడ్డడై, పశుల కాపరియై, గోపికల మనోవల్లభుడయ్యాడు. పరమ పేదవాడైన కుచేలుని చేతి పిడికెడు అటుకులు ప్రీతితో ఆరగించిన భక్తపరతంత్రుడు. దేవబ్రహ్మర్షుల సంకీర్తనలను గుత్తుగా స్వీకరించి, వెంకటాద్రిపై కాంతులతో అలరారుతున్న శ్రీనివాస పరబ్రహ్మమితడే!

చిత్రం, వివరణ
– డా చెలికాని మురళీకృష్ణారావు